క్లుప్తంగా

పల్లెదవాఖానాల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న పరిశీలకులు

దండేపల్లి: మండలంలోని గూడెం, నెల్కివెంకటాపూర్ గ్రామాల్లోని పల్లెదవాఖానాలను నేషనల్ హెల్త్‌మిషన్ ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ శనివారం సందర్శించారు. పల్లె దవాఖానాలను ప్రజలు వినియోగించుకునే తీరు, అవసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రశాంతి, మండల వైద్యాధికారి సతీష్, హెల్త్‌సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: హైదరాబాద్‌లోని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఆత్మగౌరవ భవన స్థలంలో ఆదివారం జరిగే మహాజన బహిరంగ సభకు అధిక సంఖ్యలో విశ్వబ్రాహ్మణులు హాజరై విజయవంతం చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తూరి శ్రీనాథ్‌చారి, నాయకులు వేమునూరి నరేష్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విశ్వబ్రాహ్మణుల హక్కుల సాధన కోసం ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు, మహాసభకు రాష్ట్రస్థాయి నాయకులు హాజరవుతాని శ్రీధర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్: పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో నేడు(ఆదివారం) మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రామ్మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల 33 కేవీ లైన్ వర్క్ చేయడం వల్ల 33 కేవీ నస్పూర్ ఫీడర్‌కు అంతరాయం ఏర్పడునని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల పట్టణ పరిధిలోని ఏసీసీ, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రేణుగుంట్ల స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు సబ్‌స్టేషన్ల పరిధిలోని వివిధ కాలనీల్లో ఆదివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.


కోతుల బెడద తగ్గించాలని వినతి

జన్నారం: కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన మహిళలు శనివారం సర్పంచ్ కార్తిక్‌రావు, కార్యదర్శి వినోద్‌లకు వినతిపత్రం ఇచ్చారు. ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉందని, తలుపు తెరిచి ఉంటే ఇంట్లోకి చొరబడి ఇళ్లంతా చిందరవందర చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గ్రామానికి చెందిన పలువురిపై దాడి చేసి గాయపర్చాయన్నారు. ఇకనైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కోతుల బెడద లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజగౌడ్, వార్డు సభ్యులున్నారు.

'పరిహారం చెల్లించాలి'

పాతమంచిర్యాల: మున్సిపల్ పాలక వర్గం, కమిషనర్ అనాలోచిత నిర్ణయాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అమాయకుల ప్రాణాలు కోల్పోతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని రోడ్లు గుంతలు పడి ప్రమాదకరంగా మారాయన్నారు. పట్టణంలోని వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మీటాకీస్ చౌరస్తాలలో నిర్మిస్తున్న ఐలాండ్ సర్కిల్‌ల వద్ద ప్రమాదాలు జరిగి ఇప్పటికి ముగ్గురు మృతి చెందారన్నారు. రోడ్డు ప్రమాదాలకు పూర్తి బాధ్యత మున్సిపల్ పాలకవర్గం, మున్సిపల్ కమిషనర్‌దే అన్నారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి రాజేశ్వరి, డీవైఎఫ్ఐ నాయకులు కే.ప్రేంకుమార్ పాల్గొన్నారు.

జన్నారంలో పోలీసుల కవాతు



కవాతులో పాల్గొన్న సీఐ, ఎస్సైలు

జన్నారం: వచ్చే ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు తావులేకుండా ఓటర్లు తమ ఓటు హక్కుని నిర్భయంగా వినియోగించుకోవాలని లక్సెట్టిపేట సీఐ కృష్ణ అన్నారు. ఎన్నికల సందర్భంగా జన్నారం మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్, పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహం నుంచి రామాలయం వరకు కవాతు చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ మంజుల, జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట ఎస్సైలు సతీశ్, ప్రసాద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మద్దతు ధరపై ఆశలు

- దీపావళి తర్వాతే పత్తి కొనుగోళ్లు
- సేకరణలో నిమగ్నమైన అన్నదాతలు



బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

బెల్లంపల్లి: ఉమ్మడి జిల్లాలో పత్తి సీజన్ ప్రారంభమైనా బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఇంకా ఆ యత్నాలు జరగడం లేదు. మరో పక్షం రోజులు గడిచాక కానీ కొనుగోళ్లు ప్రారంభించే అవకాశాలు లేనట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం గ్రామాల్లో పత్తి సేకరణకు రైతులు సంసిద్ధమవుతున్నారు. తొలకరి వర్షాలతో విత్తుకున్న పత్తి ప్రస్తుతం సేకరణకు వచ్చింది. అక్కడక్కడా రైతులు పత్తి సేకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. దీపావళి పండగ తర్వాత పత్తిని సేకరించే పనులు ముమ్మరంగా సాగనున్నాయి. ఆ క్రమంలోనే కొనుగోళ్లు చేపట్టాలనే యోచనలో అధికారులు ఉన్నట్లుగా తెలుస్తోంది.

పత్తి ధరపై ఆశలు...

ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పత్తికి మద్దతు ధర కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రెండు రోజుల క్రితం పత్తి అమ్మకాలు ప్రారంభం కావడంతో రైతుల దృష్టంతా మద్దతు ధరపైనే కేంద్రీకృతమైంది. క్వింటాల్ పత్తికి ఈ సారి సీసీఐ రూ.7,020మద్దతు ధరను ప్రకటించింది. గతేడాది క్వింటాల్ పత్తికి రూ.6,380 మద్దతు ధరను చెల్లించడానికి ముందుకు రాగా పోటీగా ప్రైవేట్ జిన్నింగ్ వ్యాపారులు రూ.8వేల పైచిలుకు ధర చెల్లించి రైతుల్లో ఆశలు రేకెత్తించారు. ఆఖరు దశలో ఆ ధర రూ.9వేల వరకు ఎగబాకింది. కాగా గతేడాదితో పోల్చితే ఈ సారి ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.640పెంచారు. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో పత్తి అమ్మకాలు షురూ కాగా శుక్రవారం ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్‌కు రూ.7,120 చొప్పున ధర చెల్లించారు. ముున్ముందు ధర మరింతగా పెరుగుతుందనే ఆశలో రైతులు ఉన్నారు.

గతేడాది 1.5లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు..

మార్కెట్ యార్డు పరిధిలో రైతులు విస్తారంగా పత్తి సాగు చేస్తున్నారు. బెల్లంపల్లి, తాండూర్, నెన్నెల, భీమిని, కాసిపేట, వేమనపల్లి, కన్నెపల్లి మండలాల్లో సారవంతమైన నేలలు ఉండటంతో పోటీపడి తెల్లబంగారం పండిస్తున్నారు. గతేడాది మార్కెట్ యార్డుపరిధిలో ఏకంగా 1.5లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా వ్యవసాయ మార్కెట్ కమిటీకి దాదాపు రూ.90లక్షలకు పైగా ఆదాయం వచ్చింది.

ఈ సారి కూడా ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లోనే..

బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ గిడ్డంగులు ఉన్నాయి. ఆ గిడ్డంగులను ప్రైవేట్ వ్యాపారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు అద్దెకు తీసుకుని వినియోగిస్తుండగా, పత్తి నిల్వ ఉంచడానికి గిడ్డంగులు ఉపయోగపడటం లేదనే విమర్శలు వస్తున్నాయి. బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఏటా తాండూర్ మండలం రేపల్లేవాడ శివారులో ఉన్న రెండు ప్రైవేట్ జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. సీసీఐ, ప్రైవేట్‌వ్యాపారులు ఆ జిన్నింగ్ మిల్లులు వదిలి మార్కెట్ కమిటీ యార్డుకు వచ్చి అమ్మకం, కొనుగోళ్లు చేపట్టడానికి అనాసక్తిని చూపుతున్నారు. మార్కెట్ కమిటీ యార్డుకు అందుబాటులో జిన్నింగ్ మిల్లు లేదనే సాకుచూపి ఆ తీరుగా వ్యవరిస్తుండటంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఏళ్ల తరబడి నుంచి రైతులు పడుతున్న ఇబ్బందులను మార్కెట్ కమిటీ పాలకవర్గం, అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ సారి కూడా ప్రైవేట్‌జిన్నింగ్ మిల్లుల్లో పత్తి విక్రయాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు. పత్తిని ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులకు తీసుకువెళ్లడానికి రవాణా చార్జీ భారం కానుందనే అభిప్రాయాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా ఖరారు కాలేదు..



పత్తి కొనుగోలు కోసం యత్నాలు జరుగుతున్నాయి. ఎప్పటి నుంచి కొనుగోళ్లు చేపట్టాలనేది ఇంకా ఖరారు కాలేదు. కానీ దీపావళి తదనంతరం పత్తి క్రయ విక్రయాలు చేపడితే బాగుంటుందనే అభిప్రాయానికి వచ్చాం. రైతులు కూడా అప్పుడే పత్తి సేకరణ పనులు ముమ్మరం చేసే అవకాశాలు ఉన్నాయి.

– భాస్కర్, ఏఎంసీ ఇన్‌చార్జీ సెక్రెటరీ

బొట్టుపెట్టి ఓట్లడిగిన ఎమ్మెల్యే దంపతులు

- బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రచారం



మహిళకు బొట్టు పెడుతున్న చిన్నయ్య భార్య

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి దుర్గం చిన్నయ్య దంపతులు శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. మున్సిపాలిటీలోని 10, 11, 12వార్డుల్లోని ఇంటింటికీ వెళ్లి ఓట్ల ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులు తోడు రాగా ఎమ్మెల్యే చిన్నయ్య, సతీమణి జయతార ప్రచార పర్వం సాగించారు. జయతార మహిళల నుదుటన బొట్టుపెట్టి చిన్నయ్యను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఆయా వార్డుల్లో మహిళలు చిన్నయ్యకు హారతులు పట్టి, పుష్పాలను వెదజల్లి స్వాగతం తెలిపారు. వార్డు సమస్యలు తీరలేదని పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. ప్రచార కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

కన్నెపల్లిలో..

భీమిని: కన్నెపెల్లి మండలం లింగాల, నాయకునిపేట్, మెట్‌పల్లి, ముత్తపూర్, జజ్జరవెల్లి, రెబ్బెన, జన్కాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్యనారాయణ, బెల్లంపల్లి మార్కెట్‌కమిటీ చైర్మన్ నిరంజన్, రైతు సమన్వయ సమితీ మండల కన్వీనర్, శ్రీరామరావు, నాయకులు రంగరావు, ఆకుతోట రాజన్న, కర్రె శంకర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన రేచిని సర్పంచ్

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన గడ్డం వినోద్



దుర్గుబాయికి కండువా కప్పుతున్న గడ్డం వినోద్

తాండూర్: మండలంలోని రేచిని గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ సర్పంచ్ శనివారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గడ్డం వినోద్ సమక్షంలో సర్పంచ్ దుర్గుబాయితో పాటు మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి వినోద్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరం రవీందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, ఎంపీటీసీ సిరంగి శంకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, సింగిల్ విండో డైరెక్టర్లు మాసాడి తిరుపతి, రత్నాకర్‌రావు, నాయకులు సూరం దామోదర్ రెడ్డి, పేరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ పార్టీని ఓడించాలి'

బెల్లంపల్లి: అవినీతి, అక్రమాలతో పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీని అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని కాంగ్రెస్ నాయకుడు గడ్డం వినోద్ పిలుపునిచ్చారు. శనివారం ఏఎంసీ ఏరియాలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరో వార్డు రడగంబాల బస్తీ నుంచి 130 మంది మహిళలు కొయ్యడ మల్లేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూరిబాబు, మల్లయ్య, సత్తిబాబు, విజయ్, జావీద్‌ఖాన్, శ్రీనివాస్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్‌ను గెలిపించాలని ప్రచారం



సుద్దాలలో ప్రచారం చేస్తున్న అశోక్‌యాదవ్

చెన్నూర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేయాలని మంచిర్యాల జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ చైర్మన్ కొమ్ము అశోక్‌యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం చెన్నూర్ నియోజకవర్గ కార్యదర్శి బట్టి మహేష్ ఆధ్వర్యంలో మండలంలోని సుద్దాల గ్రామంలో శనివారం గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. చెన్నూర్ మండలంలోని సుద్దాల వాగుపై వంతెన నిర్మించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో చెన్నూర్ ఎమ్మెల్యేగా బాల్క సుమన్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని 7, 15వార్డుల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌ను గెలిపించాలని కోరుతూ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికీ ప్రచారం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, నాయకులు రాంలాల్‌గిల్డా, కౌన్సిలరు జగన్నాథుల శ్రీనివాస్, అనిల్, తుమ్మ రమేశ్, రెవెల్లి మహేశ్, ఆరీఫ్, మాజీ సర్పంచ్ కృష్ణ, నాయకులు సురేశ్‌రెడ్డి, మహేందర్, ఆశీష్, వెంకటరాజం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వివేక్

భీమారం: మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు సర్పంచులతో పాటు నాయకులు శనివారం సాయంత్రం కాంగ్రెస్ నాయకులు జీ.వివేక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు వారికి వివేక్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మండలనాయకులు పొడేటి రవి, బుక్యా లక్ష్మణ్, రమేశ్, సర్పంచులు దాడి తిరుపతి, మల్లేశ్, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫకురోద్దీన్ ఉన్నారు.

'యువతకు ప్రాధాన్యం ఇచ్చే వారికే మద్దతు'

చెన్నూర్: పట్టణంలోని జలాల్ పెట్రోల్ బంక్ నుంచి గాంధీ చౌక్ వరకు యువజన నాయకులు కారెంగుల శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు.ప్రస్తుతం రాజకీయాలు కలుషితమయ్యాయని, యువతకు ప్రాధాన్యం ఇచ్చే నాయకులకు మద్దతు పలుకాలని కోరారు. యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీజేపీకి పలువురి రాజీనామా

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీకి చెందిన పలువురు బీజేపీ ముఖ్య నాయకులు శనివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణతో పాటు మరో 20మంది నాయకులు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌కు పంపించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరంతా త్వరలో గడ్డం వివేక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరనున్నారు.

సంక్షిప్త వార్తలు

నర్సరీ ప్లాంటేషన్‌ల పరిశీలన

కాసిపేట: మండలంలోని మామిడిగూడ, చి న్నధర్మారం గ్రామపంచాయతీల్లో శనివారం ఎంపీడీవో ఎంఏ అలీం నర్సరీ, ఎంలాప్ ప్లా ంటేషన్, క్రీడా ప్రాంగణం పనులను తనిఖీ చేశారు. చిన్నధర్మారంలో పనుల పరిశీలనలో విఫలం కావడం, అనధికారికంగా గైర్హాజరు కావడంపై పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీస్ అందించినట్లు తెలిపారు.

సామూహిక సీమంతం

తాండూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇద్దరు గర్భిణులకు సంప్రదాయబద్ధంగా సీమంతం చేసి చీర, సారె అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు స్వప్న, ఏఎన్‌ఎం నవిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన సదస్సు

జన్నారం: ఈ నెల 30న జరిగే శాసన సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని లక్సెట్టిపేట సీఐ కృష్ణ అన్నారు. మండలంలోని బాదంపల్లిలో శనివారం ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యత అని, అనవసరమైన గొడవలకు దిగి ఇబ్బందులు పడొద్దన్నారు. సమావేశంలో ఎస్సై సతీశ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు రక్త పరీక్షలు

తాండూర్: తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ వారు భవన నిర్మాణ కార్మిక కుటుంబాలకు, ఇతరులకు రక్త పరీక్షలు నిర్వహించారు. తాండూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం రక్త పరీక్షలు చేపట్టారు. ఈ పరీక్షల ద్వారా దాదాపు 101రకాల నమూనా పరీక్షలను నిర్వహించి వారం రోజుల్లో రిపోర్టులు ఇవ్వనున్నట్లు క్యాంప్ కో–ఆర్డినేటర్ జె.సురేష్ తెలిపారు.

11న విశ్వరూప మహాసభ

మందమర్రిరూరల్: ఈ నెల 11న మంచిర్యాల జిల్లా మందమర్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్, జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్య తెలిపారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి ఆధ్వర్యంలో శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారని తెలియజేస్తూ సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.

బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాథోడ్ రమేశ్

జన్నారం: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అవినీతి లేకుండా అభివృద్ధి చెందుతుందని ఖానాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. మండలంలోని చింతగూడలో శనివారం రాథోడ్ రమేశ్ సమక్షంలో 100మంది యువకులు, నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి ఎక్కువైందన్నారు. నీరు లేని గ్రామాలున్నాయేమో గాని మద్యం దొరకని గ్రామాలు లేవని, ఈ ఘనత సీఎం కేసీఆర్‌దే అని ఆరోపించారు. పదేళ్ల పాలనలో మిగులు రాష్ట్రమైన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. యువకులు, నాయకులు వచ్చే ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బద్రినాయక్, నాయకులు శంకరయ్య, మధుసుదన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



ప్రభుదాస్‌ను ఆహ్వానిస్తున్న జాన్సన్ నాయక్

జన్నారం: కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ బోర్లకుంట ప్రభుదాస్ కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి తన అనుచరులతో, పార్టీ కార్యకర్తలతో కలిసి, శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్ ప్రభుదాస్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ చంద్రశేఖర్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, పార్టీ అధ్యక్షుడు రాజరాంరెడ్డి, నాయకులు బుచ్చన్న, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మరోసారి బీఆర్‌ఎస్‌నే గెలిపించాలి

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



ఎన్నికల ప్రచారంలో నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి బీఆర్‌ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 12వ వార్డు, 4వ వార్డు, 17వ వార్డుల్లో ఆయన పర్యటించి, ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. మరో సారి బీఆర్‌ఎస్ పార్టీకే ప్రజలు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా 4వ, 17వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన 70మంది మహిళలను బీఆర్‌ఎస్ పార్టీలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు నల్ల శంకర్, మోతె సుజాత, పోరెడ్డి రాజు, నాయకులు పానగంటి శ్రీని వాస్, బగ్గని రవి, శ్రీపతి శ్రీనివాస్, కేసీఆర్ కళాకా రుడు రాజారమేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా ఎమ్మెల్యే ప్రచారం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గిరిజన గ్రామమైన చిన్నగోపాల్‌పూర్‌తో పాటు రాపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్‌రావు ఇంటింటికీ వెళ్తూ బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే పథకాలను వివరిస్తూ, కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ప్రచారం చేశారు.

'బీజేపీ గెలుపుతో గ్రామాల్లో అభివృద్ధి'



గఢ్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న రఘునాథ్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో శనివారం బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్తూ బీజేపీ అందించనున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ బీజేపీతో గ్రామాలు సస్యశ్యామలమవుతాయని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్ ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో బీజేపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్, కాసిపేట గ్రామాల్లో బీజేపీ నాయకులు శనివారం గడపగడపకూ తిరిగి ప్రచారం నిర్వహించారు. మంచిర్యాల బీజేపీ అభ్యర్థి రఘునాథ్‌రావును గెలిపించాలని కోరారు. చింతపెల్లికి చెందిన పలువురు బీజేపీలో చేరగా, వారికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మంచిర్యాల నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘునాథ్ రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'బీజేపీకే ఓటు వేయండి'

మంచిర్యాలటౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల బీజేపీ అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన సతీమణి వెరబెల్లి స్రవంతి కోరారు. జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లో శనివారం ఇంటింటి ప్రచారంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గం అభివృద్ధి, పట్టణం అభివృద్ధి చెందాలంటే కేవలం రఘునాథ్‌తోనే సాధ్యమన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రచారం

దండేపల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటేసి, ప్రేంసాగర్ రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్, టీకానపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోని ఓటర్ల ఇళ్ల గడపగడపకూ వెళ్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు గ్యారంటీ హామీలను వివరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు చేతి గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ కరపత్రాలతో ప్రచారం చేశారు. ప్రచారంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన



చేనేత హస్తకళల ప్రదర్శన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శ్రీకళని చేనేత, హస్తకళలు ప్రదర్శన పట్టణ ప్రజలను విశేషంగా ఆకర్షిస్తుంది. పట్టుచీర, ఫ్యాన్సీటాప్స్, ఖాదీషర్ట్స్, బెడ్‌షీట్లు, ఫ్యాన్సీ జువెల్లరీ, బెంగాలీ చీరలు, కట్ వర్క్ సోఫా డోర్ కర్టెన్‌లు, ఆహార పదార్థాలు, మసాల వంటింటి సరుకులు, వస్తువులు, కొండపల్లి బొమ్మలు, పిల్లల ఫ్యాన్సీ టాప్స్, ఖాదీ టాప్స్‌లను అమ్ముతున్నట్లు నిర్వాహకులు వేణుగోపాల్, ఎండీ హుస్సేన్‌లు తెలిపారు. పట్టణ ప్రజల నుంచి వీటి కొనుగోలుకు మంచి స్పందన వస్తుందని అన్నారు.